తెదేపాతోనే బీసీలకు గౌరవం



ధీరజ్ తయారు చేసిన యాప్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత, తదితరులు

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: మొదటి నుంచి బీసీలను గుర్తించి గౌరవించిన పార్టీ తెదేపా అని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అసంపూర్తిగా నిలిచిన నాలుగు మహాత్మా జ్యోతిబా పులే గురుకుల పాఠశాలల నిర్మాణాలు పూర్తి చేయడం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.77.64 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇందులో రొద్దం ఎంజేపీ పాఠశాల నిర్మాణాన్ని రూ.20.19కోట్లతో నేటి నుంచి పనులు ప్రారంభిస్తారని వెల్లడించారు. 2014-19 మధ్య ఉమ్మడి జిల్లాకు 4ఎంజేపీ పాఠశాలలు మంజూరవ్వగా 80 శాతం నిర్మాణ పనులు పూర్తి చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా కేవలం 20శాతం నిర్మాణం పూర్తిచేయకుండా వదిలేశారని విమర్శించారు. జిల్లా కేంద్రంలో బీసీ భవనాలు నిర్మాణానికి చర్యలు తీసుకొంటామన్నారు.


త్వరలో డీఎస్సీ శిక్షణ కేంద్రం ప్రారంభం

త్వరలో పెనుకొండలో డీఎస్సీ శిక్షణ కేంద్రం ప్రారంభిస్తామని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా ఇటీవల పెనుకొండ మండలంలోని రాంపురంలో నూతనంగా ప్రారంభించిన ఎంజేపీ బాలికల పాఠశాలకు పక్కాభవనం నిర్మాణం కోసం స్థల సేకరణ చేస్తున్నామని, త్వరలో అక్కడ పాఠశాల నిర్మిస్తామన్నారు. సమావేశంలో పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల యాప్ ఆవిష్కరణ

గోరంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ధీరజ్ తయారుచేసిన జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాల వివరాలను తెలియజేసే మొబైల్ యాప్‌ను బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆవిష్కరించారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ధీరజ్ తయారు చేసిన మొబైల్ యాప్‌లో జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, వాటి ప్రాముఖ్యతను తెలుగు, ఆంగ్లం, కన్నడ, తమిళ, హిందీ భాషల్లో వివరాలు తెలియజేయడంతో పాటు, రూట్‌మ్యాప్, దూరం చూపిస్తుంది.

అనంత జ్వరకంపితం!




అనంతపురం (వైద్యం), పుట్టపర్తి, న్యూస్‌టుడే

ఉమ్మడి అనంత జిల్లాలో రోజురోజుకు జ్వరాల కేసులు పెరుగుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు జ్వరపీడితులతో కిక్కిరిసిపోతున్నాయి. వాతావరణంలో మార్పులు, నీరు కలుషితం, పారిశుద్ధ్యలోపం తదితర కారణాలతో జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ఆసుపత్రుల బాట పట్టాల్సి వస్తోంది. ఎక్కువ మంది జ్వరంతోపాటు దగ్గు, జలుబు, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నట్లు వైద్యఆరోగ్య శాఖ అధికారులు గుర్తించారు. మున్సిపల్, పంచాయతీ, వైద్యారోగ్యశాఖ సమన్వయంతో పని చేస్తేనే క్షేత్రస్థాయిలో జ్వరాల నివారణకు సాధ్యమవుతుంది. చాలా చోట్ల దోమల నివారణకు ఫాగింగ్ ప్రక్రియ చేపట్టడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



అనంతపురం సర్వజన వైద్యశాల పీడియాట్రిక్ విభాగంలో జ్వరం బారిన పడిన చిన్నారులు



విభాగాల్లో 80 మంది చికిత్స పొందుతున్నారు. ఇందులో చిన్నపిల్లలు 40 మంది ఉన్నారు. ఆరు డెంగీ కేసులు నమోదయ్యాయి. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

లక్షణాలు ఉంటే వైద్యుడిని సంప్రదించాలి

- ప్రవీణ్‌దీన్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల

శరీరంపై ఎర్రటి మచ్చలు, వాంతులు, కడుపునొప్పి, నీరసంగా ఉన్నట్లు అనిపించటం, ఆకలి తగ్గిపోవటం, దగ్గు, జలుబు, రెండు రోజుల్లో జ్వరం తగ్గి.. తిరిగి రావడం.. తదితర లక్షణాలు పెద్దల్లో కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి. చిన్నిపిల్లల విషయానికి వస్తే నీరసం, నిద్ర పోకపోవడం, దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించి.. చికిత్స పొందాలి. దోమల నివారణకు ఇంట్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. తాగునీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

మూడు నెలల్లో 73,886 కేసులు గుర్తింపు

ఉమ్మడి జిల్లాలో జులై, ఆగస్టుతోపాటు ఈనెలలో ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి 73,886 జ్వరపీడితులను గుర్తించారు. 23,888 మందికి వారం రోజులైనా జ్వరం తగ్గకపోవటంతో ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 13,119 మంది వైద్యసేవలు (ఓపీ) పొందారు. ప్రస్తుతం అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్

బాధితులను గుర్తించి వైద్యసేవలు అందిస్తాం

- ఈ.బి.దేవి, డీఎంహెచ్‌వో, అనంతపురం

ఇంటింటా సర్వేలో జ్వరబాధితులను గుర్తించి మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్యసేవలు పొందాలి. మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో పని చేస్తున్నాం. ప్రతి వారం డ్రైడే, ఫ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నాం. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయడం నిబంధనలకు విరుద్ధం. రక్త నమూనా తీసి.. డీఎంహెచ్‌వో కార్యాలయ అనుమతితో సర్వజన వైద్యశాలకు పంపాలి. అక్కడ నిర్వహించే పరీక్షలో పాజిటివ్ వస్తేనే డెంగీగా నిర్ధారించాలి. కిట్లతో పరీక్ష చేసి, డెంగీ ఉందని రోగులకు చెప్పి.. వైద్యం చేస్తే సంబంధిత ఆసుపత్రుల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం.



ఓబుళదేవరచెరువులోని చెరువులో అమృత్ సరోవర్ కింద రూ.4 లక్షలు ఖర్చు చేసినట్లు దస్త్రాల్లో చూపించారు. అక్కడ పనులే జరగలేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు.



సోమందేపల్లి మండలం మరకుంట్లపల్లి, పెద్దిరెడ్డి గ్రామాలకు సంబంధించిన చెరువుల్లో రూ.8 లక్షలు చొప్పున నిధులు ఖర్చు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించగా.. రెండు చోట్లా పనులు చేయలేదని స్థానికులు చెబుతున్నారు.

అమృత్ సరోవర్ ఆశయంపై నీళ్లు

చెరువుల పనులు చేయకుండానే నిధులు స్వాహా

ఈనాడు డిజిటల్, అనంతపురం -న్యూస్‌టుడే, సోమందేపల్లి, మడకశిర, ఓడీసీ: చెరువులను పునరుజ్జీవింపజేయడం.. అవసరమైన చోట కొత్తవి నిర్మించాలనే ఆశయంతో చేపట్టిన అమృత్ సరోవర్ పథకానికి గత వైకాపా ప్రభుత్వంలో తిలోదకాలు వదిలారు. తూతూమంత్రంగా పనులు చేసి నిధులు పక్కదారి పట్టించారు. కొన్నిచోట్ల పనులు చేయకుండానే చేసినట్లు దస్త్రాల్లో చూపి అవినీతికి పాల్పడ్డారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది దొంగ మస్టర్లు సృష్టించి అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. నీళ్లు నిండే అవకాశం ఉన్న చెరువుల్లో పనులు చేపట్టినట్లు చూపారు. భవిష్యత్తులో విచారణ జరిగిన దొరకకుండా ఉండటానికి తెలివిగా వ్యవహరించినట్లు సమాచారం. మరికొన్ని చెరువులకు సంబంధించి పాత పనులనే కొత్తగా చేసినట్లు చూపి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.6 కోట్లు ఖర్చు..

శ్రీసత్యసాయి జిల్లాలోని 79 చెరువుల్లో అమృత్ సరోవర్ పథకం కింద పనులు చేపట్టారు. పూడికతీత, కట్ట బలోపేతం, తూముల మరమ్మతు తదితర పనులు చేసినట్లు రికార్డుల్లో చూపించారు. చాలాచోట్ల గతంలో జరిగిన పనులనే కొత్తగా చేసినట్లు చూపించారు. ముఖ్యంగా నీరు చేరిన చెరువుల్లో పనులు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. 2022-23, 2023-24కు గాను రూ.6 కోట్లు ఖర్చు చేశారు. సగానికి పైగా నిధులు పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. గత వైకాపా ప్రభుత్వంలో ఉపాధి అధికారుల సహకారంతోనే అక్రమాలు చోటుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు కొత్త చెరువుల నిర్మాణంపై కనీస దృష్టి పెట్టలేదు. పాత చెరువుల్లోనే పనులు చేసినట్లు చూపించి చేతులు దులుపుకొన్నారు. ఒక ఎకరా స్థలంలో 10 వేల క్యూబిక్ మీటర్లలో నీరు నిలిచేలా పనులు చేయాల్సి ఉండగా.. వాటి జోలికి వెళ్లలేదు.



మడకశిర మండలం ఆమిద్యాలగొంది గ్రామ చెరువులో రూ.16 లక్షలు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. కనీసం రూ.4 లక్షలు విలువైన పనులు కూడా జరగలేదు.

విచారణ జరిపిస్తాం

అమృత్ సరోవర్ పథకంలో అవకతవకలు జరిగినట్లు మా దృష్టికి రాలేదు. ఉపాధి కూలీల ద్వారానే పనులు చేపట్టాం. నేరుగా వారి ఖాతాల్లోకే నిధులు జమ చేశాం. ఎక్కడైనా అవినీతి జరిగినట్లు ఉంటే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

- విజయేంద్రప్రసాద్, డ్వామా పీడీ

జేఎన్‌టీయూకు జాతీయస్థాయి పురస్కారం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూకు 'మేకింగ్ ఇండియా ఎంప్లాయబుల్' పురస్కారం దక్కిందని ఇన్‌ఛార్జి వీసీ సుదర్శనరావు తెలిపారు. ముంబయిలో ఇండియా ఎంప్లాయర్ ఫోరం, ఇండియా ఎడ్యుకేషన్ ఫోరం సంయుక్తంగా ఈ నెల 25న జరిగిన నిర్వహించిన సమావేశంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. జేఎన్‌టీయూ వర్సిటీ డేటాను దృష్టిలో ఉంచుకొని ఈ అవార్డు ప్రకటించారు. డీఏపీ డైరెక్టర్ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ ముంబయిలో ఈ అవార్డు అందుకున్నారు. జేఎన్‌టీయూలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఇన్‌ఛార్జి ఉపకులపతి డీఏపీ డైరెక్టర్‌కు అందజేశారు. ఓఎస్‌డీ దేవన్న, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ప్రిన్సిపల్ చెన్నారెడ్డి, డైరెక్టర్లు భానుమూర్తి, సుజాత, విశాలి, సురేష్‌బాబు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

ప్రజా సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలి: మంత్రి

ధర్మవరం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం ధర్మవరం పట్టణంలోని మంత్రి కార్యాలయంలో జిల్లా, నియోజకవర్గ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య రాకూడదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు మంత్రి సూచించారు. జల్ జీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలన్నారు. ధర్మవరం నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, వార్డు సచివాలయ నోడల్ అధికారి శివారెడ్డి, ఆర్ అండ్‌బీ ఎస్ఈ సంజీవయ్య, ఆర్డీవో వెంకటశివరామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాను పర్యాటక, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేద్దాం

కలెక్టర్ చేతన్



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్, తదితరులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాను ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయడమే ధ్యేయమని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. శుక్రవారం రాత్రి పుట్టపర్తి సాయిఆరామంలో పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జేసీ అభిషేక్‌కుమార్, పర్యాటకశాఖ అధికారులు జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. జిల్లాలో ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా 22 ప్రాంతాలు ఉన్నాయన్నారు. లేపాక్షికి యునెస్కో వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరంహిందూపురం, ధర్మవరం, కదిరి తదితర ప్రాంతాలకు చెందిన కళాకారులు, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. పర్యాటక గోడపత్రులను ఆధునికంగా రూపొందించిన గౌతంకు రూ.10వేలు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులను కలెక్టర్ అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకాధికారి అజయ్‌కుమార్, పర్యాటక కౌన్సిల్ సభ్యులు పద్మనాభం, నాయకులు జ్యోతికేశవ, జిల్లా అటవీ శాఖ అధికారి చక్రధర్, జిల్లా మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, శిల్పారామం మేనేజర్ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలపై సీఎంకు లేఖ

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరంలో మరమగ్గాలపై చేనేత రకాలు తయారు చేస్తున్నారని, చేనేత రిజర్వేషన్ చట్టం అమలు చేసే విధంగా చూడాలని, జె.ఆర్.శిల్క్స్ అక్రమాలపై చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ లేఖ రాశారు. ఆ లేఖను శుక్రవారం సీపీఐ నాయకులు విడుదల చేశారు. ధర్మవరంలో జెట్ లూమ్స్, మరమగ్గాలపై చేనేత రకాలు తయారు చేస్తుండటంతో మగ్గాలపై ఆధారపడి జీవనం చేసే కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని అందులో పేర్కొన్నారు.

ఒక్క క్లిక్‌తో ఉపాధి సమాచారం

అందుబాటులో జన్‌మన్ రేగా యాప్

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే


జాతీయ మహాత్మ గాంధీ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం జన్‌మన్ రేగా యాప్‌ను తీసుకువచ్చింది. ఈ యాప్ ద్వారా సమగ్ర వివరాలు తక్షణమే తెలుసుకునే వీలుంది. కూలీలు ఇప్పటి వరకు ఏ సమాచారం కావాలన్నా ఎంపీడీవో, తపాలా కార్యాలయాలు, ఉపాధి సిబ్బంది చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. ఇక నుంచి ఆ అవసరమే ఉండదు. సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ అరచేతిలో సమగ్ర వివరాలు తెలుసుకోవచ్చు.

ఏ ఏ వివరాలు ఉంటాయంటే..

సెల్‌ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్‌లో జన్‌మన్ రేగా (జేఏఎన్ఎంఏఎన్ఆర్ఈజీఏ) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో కూలీల వివరాలు, హాజరు, వేతనాలు తదితర వివరాలు క్లిక్ చేస్తే బ్లాక్ తెరుచుకుంటుంది. రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ, ఉపాధి జాబ్ కార్డు సంఖ్య నమోదు చేసి క్లిక్ చేస్తే వివరాలు ప్రత్యక్షమవుతాయి. కూలీ పేరుపై క్లిక్ చేస్తే పని చేసిన రోజులు, కూలి మొత్తం, ఏ బ్యాంకు ఖాతాలో నగదు జయ అయింది, ఎంత జమ అయిందో పూర్తి వివరాలు కనిపిస్తాయి. ఒకవేళ వేతనదారుడికి నగదు జమ కాకపోతే కారణాలు స్పష్టంగా కనిపిస్తాయి. దాంతోపాటు ఉపాధి పథకంలో చేపట్టే పనుల వివరాలు, సమాచారం ఉంటుంది.

అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు

ఉపాధి పనుల్లో అక్రమాలు, అవినీతి జరిగితే యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో పని చేసినా, ఉపాధి సిబ్బంది బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినా ఫిర్యాదు చేయవచ్చు. ఈ వివరాలు అన్ని భాషల్లోనూ అందుబాటులో ఉన్నాయి. ఉపాధి హామీ పథకంలో పారదర్శకతకు పెద్దపీట వేయాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించింది.





యాప్ ముఖచిత్రం

అవగాహన అవసరం..

జన్‌మన్ రేగా యాప్‌పై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. యాప్ అందుబాటులో ఉన్న విషయం చాలా మందికి తెలియదు. ఉపాధి హామీ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనులు చేసే చోట కూలీలకు అవగాహన కల్పిస్తే ఉపయుక్తంగా మారనుంది.

రమణీయత రంగరించి

● అందుబాటులో చేనేత వస్త్రాలు ● అనంత నేతబజారులో కొత్త దుకాణ సముదాయం



అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: చేనేతలకు చేయూత నిచ్చే ఆప్కో దుకాణాల్లో అన్ని రకాల వస్త్రాలను అమ్మకాలు చేస్తున్నారు. మహిళలు ఇష్టపడే చీరలతో పాటు, పంచలు, టవళ్లు, లుంగీలు అందుబాటులో ఉంచారు. అనంత నగరం టవర్‌క్లాక్ సమీపంలోని నేత బజార్‌లో ఆప్కో దుకాణ భవన సముదాయాన్ని కొత్తగా నిర్మించారు. ధర్మవరం పట్టు చీరలు, బందరు, రాజమండ్రి, ఉప్పాడ, మాధవరం, మంగళగిరి, కాటన్, సిల్క్ చీరలు, వీటితో పాటు పొందూరు పంచలు, శ్రీకాకుళం టవళ్లు, కర్నూలు తెల్ల పంచలు విజయనగరం మంచం నవార అందుబాటులో ఉన్నాయి.



పట్టుచీరలు చూపిస్తున్న మహిళలు

చేనేతలకు ఉపాధి కల్పించాలి


వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న చేనేతలకు ఉపాధి కల్పించాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలి. చేనేత వస్త్రాలు ధరించాలి. ప్రస్తుతం 30 శాతం రాయితీతో అందిస్తున్నాం. పండగలు ఇతరత్రా సమయాల్లో 50 శాతం రాయితీ ఉంటుందన్నారు.

\- పవన్, మేనేజర్

అనిశాలో స్తబ్దత

● మూడేళ్లలో కేవలం 20 కేసులు

● అవినీతిపరుల కూపీ లాగడంలో వెనుకంజ



అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రభుత్వ శాఖల్లో అవినీతి అధికారుల అవినీతి కేసులు, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు వెలికితీసి పట్టుకోవడంలో అవినీతి నిరోధక శాఖ వెనకబడుతోంది. కొందరు అధికారులు పెద్ద ఎత్తున లంచాలు తీసుకుంటూ అవినీతి పాల్పడుతున్నా, ప్రతి పనికి చేతులు చాస్తున్నా ఆగడాలను అరికట్టే రీతిలో అనిశా పాత్ర పోషించలేదని విమర్శలు వస్తున్నాయి.

● రెవెన్యూ, పోలీసు, రిజిస్ట్రేషన్, విద్యుత్, వ్యవసాయ శాఖల్లో లంచాల జాడ్యం అధికం. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2022 జనవరి నుంచి ఈ ఏడాది సెప్టెంబరు 25 వరకు కేవలం 20 కేసులు నమోదు అయ్యాయి. వాటిలో రెవెన్యూ శాఖలో 6, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో 4, సంక్షేమశాఖ, కమ్యూనిటీ బ్రాంచ్, వ్యవసాయం, విద్యుత్, విద్యాశాఖలో ఒక్కటి చొప్పున కేసులు ఉన్నాయి. ఒక కేసులో ఏకంగా రిజిస్ట్రార్, పోలీసు, రెవెన్యూ అధికారులు నిందితులుగా ఉన్నారు. 2022లో 6, 2023లో 7, 2024లో 7 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో 15 కేసులు బాధితులు ఫిర్యాదు చేయడం వల్ల ట్రాప్ చేసి పట్టుబడ్డారు. మరో 5 కేసులు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ చేపట్టింది.

దొరికిపోయినా దర్జాగా బయటకు

● కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లో 2022 జనవరిలో ఓ సర్వేయర్ భూమి కొలతలు వేయడానికి ఓ మహిళా రైతును లంచం డిమాండ్ చేసి దొరికిపోయాడు. అతనిపై కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఏం జరిగిందో తెలియదు గానీ, రెండేళ్ల లోపే పోస్టింగ్ తెచ్చుకుని ప్రస్తుతం కడప జిల్లాలో దర్జాగా ఉద్యోగం చేస్తున్నాడు. అదే ఏడాది డిసెంబరులో భూమి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో రెవెన్యూ, పోలీసు, రిజిస్టర్ అధికారులపై అనిశా కేసులు నమోదు చేసింది. వారిలో ఓ పోలీసు అధికారి ఆ కేసు నుంచి బయటపడి ఉద్యోగంలో చేరాడు. మిగతా శాఖల అధికారులూ పోస్టింగులు తెచ్చుకున్నారు.

వీగిపోతున్న కేసులు

నిబంధనల ప్రకారం ట్రాప్ కేసుల్లో దొరికిపోయిన వారిపై 3 నెలల్లో, ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఆరు నెలల్లో, అనిశా నివేదికపై ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ నెలల తరబడి విచారణ సాగుతూనే ఉంటోంది. ఈ లోపు సర్వీసు నిబంధనల వంకతో, రాజకీయ ప్రాబల్యంతో ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరుతున్నారు.

ప్రతిదానికో రేటు

ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ విభాగంలో అవినీతి అధికారులు పెచ్చరిల్లిపోతున్నారు. భూమి వివరాలను ఆన్‌లైన్‌లో ఎక్కించాలంటే వీఆర్వో, భూమి కొలతలు వేయడానికి సర్వేయర్లు ఆమ్యామ్యాలు పుచ్చుకుంటున్నారు. ఈ ఏడాది జులైలో వజ్రకరూరు మండలం తహసీల్దార్.. ఓ రైతుకు చెందిన భూమిని ఆన్‌లైన్‌కు ఎక్కించడానికి భారీ మొత్తం డిమాండ్ చేసి పట్టుబడ్డాడు. పామిడి మండలం ఆర్ఐ కూడా లంచం తీసుకుంటూ దొరికాడు. రైతులకు వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి, మెటీరియల్ తొందరగా ఇవ్వడానికి సైతం లంచాలు దండుకుంటున్నా చర్యల్లేవు.

మూడేళ్లుగా ఇన్‌ఛార్జి డీఎస్పీనే..

అనంతపురం అనిశా కార్యాలయానికి మూడేళ్లుగా పూర్తి స్థాయి డీఎస్పీ పోస్టింగ్ లేదు. చివరగా 2021లో ఇక్కడ పనిచేస్తున్న కులశేఖర్ అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది తిరుపతికి బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఆ స్థానం ఖాళీగా ఉంది. కొన్నిరోజులపాటు కర్నూలు, ఒంగోలు డీఎస్పీలు ఇన్‌ఛార్జిగా పనిచేశారు. ప్రస్తుతం తిరుపతిలో పనిచేస్తున్న ప్రశాంతి ఉమ్మడి జిల్లాకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. పాలనాపరంగా సమస్యలు తలెత్తుతున్నాయి. ఆరు ఇన్‌స్పెక్టర్ పోస్టులు నియమించాల్సి ఉండగా, కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఎస్సైలతోనే విధులు నిర్వహిస్తున్నారు.



నిర్వాహకుడిని హెచ్చరిస్తున్న డీఎంహెచ్‌వో ఈ.బి.దేవి

ప్రైవేటు క్లినిక్‌ల సీజ్

రాయదుర్గం పట్టణం, అనంతపురం (వైద్యం): ఆయుర్వేదిక్ కోర్సు చేసి ఆ మేరకు ప్రజలకు వైద్యం అందించకుండా అల్లోపతి వైద్యం అందిస్తున్న మూడు క్లినిక్‌లను ఎట్టకేలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. ఈ ఏడాది జూన్ 10న 'ఈనాడు'లో 'చదివింది ఒకటి.. చేసే వైద్యం మరొకటి!' కథనం ప్రచురితమైంది. అధికారులు ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశారు. కొన్ని రోజుల తరువాత సంజాయిషీ ఇచ్చారు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈనెల 26న 'నిబంధనలు చూడరు.. అనుమతులు ప్రశ్నించరు!' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించి చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో ఈ.బి.దేవిని ఆదేశించారు. శుక్రవారం డీఎంహెచ్‌వో, డెమో త్యాగరాజు, హెచ్‌ఈవో గంగాధర్ సిబ్బందితో కలిసి రాయదుర్గంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ క్లినిక్‌లను పరిశీలించారు. కేర్, బిశ్వాస్, సైనిక్ ప్రైవేట్ క్లినిక్‌లను తనిఖీ చేసి సీజ్ చేశారు. భూమిక ఫిజియోథెరపీ క్లినిక్ యాజమాన్యానికి నోటీసు జారీ చేశారు.

'లేపాక్షి' భూములను రైతులకు అప్పగించాలి

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములను రైతులకు అప్పగించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీశ్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. శుక్రవారం సాయిఆరామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో చిలమత్తూరు మండలం లేపాక్షి ప్రాంతంలో 8,844 ఎకరాలను కొనుగోలు చేశారు. పరిశ్రమలు స్థాపించి లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన అప్పటి ప్రభుత్వం భూములను తాకట్టు పెట్టి బ్యాంకులను లూటీ చేసిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య, ఆంజనేయులు, మహేదవ, కమతం కాటమయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: శ్రీకాకుళంలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-17 పాఠశాల క్రీడల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులను శుక్రవారం ఎంపిక చేశారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించి అందులో సత్తాచాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పాఠశాల క్రీడల సమాఖ్య అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కార్యదర్శులు బి.సుగుణమ్మ, డి.మొరార్జీ యాదవ్, పీడీలు అక్కులప్ప, వేణుగోపాల్, జగదీశ్వరయ్య, జగన్‌మోహన్‌రెడ్డి, తిమ్మరాజు, బాలకృష్ణ సమక్షంలో క్రీడాకారుల ఎంపిక జరిగింది.

అండర్-17 బాలుర జట్టు: టి.రాజేష్, కె.ముఖేష్ (100 మీ. పరుగు), డి.హరిశంకర్, డి.శశికాంత్ (200 మీ. పరుగు), హరిశంకర్, టి.రాజేష్ (400 మీ. పరుగు), యశంత్, పవన్ (3వేల మీ. పరుగు), డి.నరసింహారెడ్డి, సుదర్శన్ (లాంగ్‌జంప్), వి.సిద్ధార్థ, వై.బన్నీ (హైజంప్), డి.వసంత్, బి.దేవేంద్ర నాయక్ (షాట్‌పుట్), హేమంత్ కుమార్, మధు (5వేల మీ. నడక).

బాలికల జట్టు: హెచ్.అర్చన, ఎస్.లక్ష్మీ (100 మీ. పరుగు), జి.యశస్విని, ఎ.ఇంద్రలేఖ (200 మీ. పరుగు), ఎ.ఇంద్రలేఖ, సి.ఉదయశ్రీ (400 మీ. పరుగు), డి.సమీరా, హరిణి (3వేల మీ. పరుగు), జి.యశస్విని, ఆర్.మానస (లాంగ్ జంప్), డి.హర్ష, ఎం.వాణి (హైజంప్), వి.సరస్వతి, రమ్యశ్రీ (షాట్‌పుట్), సి.మౌనిక, హెచ్.వర్షిత (3వేల మీ. నడక), లాస్యరెడ్డి, ఉదయశ్రీ (800 మీ. పరుగు).

దేశ ప్రగతికి పర్యాటక రంగం కీలకం

లెక్చరర్స్‌కాలనీ (అనంత గ్రామీణం): వైకాపా ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న పర్యాటక రంగాన్ని పునరుద్ధరించడానికి అన్ని చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. అనేక దేశాలు పర్యాటక రంగంపైనే ఆధారపడి ప్రగతి సాధిస్తున్నాయి. మన జిల్లాలో అనేక పర్యాటక స్థలాలు ఉన్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. శుక్రవారం శిల్పారామంలో పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కలెక్టర్ వినోద్‌కుమార్, జడ్పీ ఛైర్‌పర్సన్ బి.గిరిజమ్మ, సహాయ కలెక్టర్ బి.వినూత్న, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీటీఈఓ వెంకటరమణ నాయక్, జిల్లా పర్యాటక శాఖ అధికారి జయకుమార్ బాబు, అనంతపురం తహశీల్దారు హరికుమార్ పాల్గొని ప్రసంగించారు. ఎంపీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో హరిత హోటళ్లు, టూరిజం రెస్టారెంట్స్, పురాతన పర్యాటక స్థలాలు దీనస్థితికి చేరాయని ఆరోపించారు. శ్రీ కృష్ణదేవరాయల కాలంనాటి దేవాలయాలు, చెరువులను కాపాడుకుని చరిత్రను పిల్లలకు చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ.. శిల్పారామానికి పూర్వవైభవం తీసుకురావడానికి రూ. 10 కోట్ల నిధులు సీఎంను కోరామని తెలిపారు. నగర వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడానికి కృషి చేస్తామన్నారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలోని పామిడి సమీపంలో అనంత గజగరుడ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో శేష శిల్పకళ ఉన్నట్లు జిల్లా వాసులకే తెలియదన్నారు. అలాంటి దేవాలయాలను వెలుగులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాకు పర్యాటకుల సంఖ్య పెంచడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో పాల్గొని విజేతలైన వారికి బహుమతులు అతిథులు ప్రదానం చేశారు.



బహుమతులు అందుకున్న విజేతలతో ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, తదితరులు

రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : ఉమ్మడి అనంతపురం జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో చిరు జల్లులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని రేకులకుంట వాతావరణ కేంద్రం శాస్త్రవేత్తలు విజయ్‌శంకర్‌బాబు, నారాయణస్వామి తెలిపారు. వచ్చే ఐదు రోజులూ పగటి ఉష్ణోగ్రతలు 33.6 నుంచి 37.0 డిగ్రీలుగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు 24.4 నుంచి 26.5 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. నైరుతి దిశగా గాలులు గంటకు 8 కిలోమీటర్ల వేగంతో వీస్తాయన్నారు. ఉదయం పూట గాలిలో తేమ 81 శాతం, మధ్యాహ్నం పూట 48 శాతం ఉంటుందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటలైన ఉలవ, పెసర, అలసంద, జొన్న, కొర్ర తదితర పంటలు సాగు చేసుకోవాలని శాస్త్రవేత్తలు తెలిపారు.

సగం ధరకే సరకు పేరిట మోసం

వ్యాపారిని బెదిరించి రూ.6 లక్షలతో ఉడాయింపు

నల్లమాడ, న్యూస్‌టుడే: 'సగం ధరకే దుకాణంలో వస్తువులన్నీ ఇచ్చేస్తున్నారు. వారికి డబ్బు అత్యవసరం. సగం డబ్బిస్తే చాలు రూ. 20 లక్షల సరకు సొంతం అవుతుంది' అని చెప్పడంతో ఓ వ్యాపారి ఆశపడ్డాడు. చివరికి కేటుగాళ్ల చేతిలో చిక్కి మోసపోయాడు. నిందితులు పక్కా ప్రణాళిక ప్రకారం కర్ణాటక రాష్ట్రం దావణగిరి తీసుకెళ్లి రూ.6 లక్షలు స్వాహా చేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి వివరాల మేరకు.. నల్లమాడకు చెందిన పవన్ ఎలక్ట్రానిక్ వస్తువుల దుకాణం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. కొంతకాలం కిందట బెంగళూరు బేకరీకి చెందిన యోగి దుకాణంలో కొన్ని వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చి పరిచయమయ్యాడు. అతడు తన బంధువును తీసుకొచ్చి అదే దుకాణంలో మరికొన్ని వస్తువులు కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో పవన్‌తో ఇద్దరు మాట కలిపారు. కర్ణాటక రాష్ట్రం దావణగెరె ప్రాంతంలో ఎలక్ట్రానిక్ వస్తువులకు సంబంధించిన పెద్ద షాపు తొలగిస్తున్నారు. అందులోని వస్తువుల విలువ రూ.20 లక్షలు ఉంటుందని చెప్పారు. రూ.10 లక్షలు ఇస్తే సరకు మొత్తం ఇచ్చేస్తారని నమ్మించారు. ఒక రోజు వీడియో కాల్ చేసి దుకాణంలోని వస్తువులు ఇవేనని చూపించారు. పెద్ద మొత్తంలో సరకు సగం ధరకే దక్కుతుందని పవన్ ఆశపడ్డారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా తన స్నేహితుడిని వెంటబెట్టుకుని ఈ నెల 26న రూ.6 లక్షలు తీసుకొని కారులో దావణగెరె వెళ్లారు. అప్పటికే అక్కడ ప్రణాళిక రచించిన నిందితులు మారణాయుధాలతో వ్యాపారితో పాటు స్నేహితుడిని బెదిరించి రూ.6 లక్షలతో ఉడాయించారు. మోసపోయానని తెలుసుకున్న బాధితుడు నల్లమాడకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పర్యాటకశాఖ ఉత్తమ గైడ్‌గా విరూపన్న



మంత్రి కందుల దుర్గేష్ చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న విరూపన్న

లేపాక్షి: రాష్ట్ర ఉత్తమ పర్యాటక శాఖ గైడ్‌గా 2023-24 సంవత్సరానికి గాను శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షికి చెందిన విరూపన్న ఎంపికయ్యారు. ఈయన 2004 నుంచి ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయంలో గైడ్‌గా పని చేస్తున్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రంలోనే ఒకే ఒక్క గైడ్‌గా మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

బాలికపై వీఆర్ఏ అత్యాచారయత్నం

పుట్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని శనగలగూడూరు గ్రామంలో వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్న తిరుపాలు ఓ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు ఆరో తరగతి చదువుతున్న బాలిక పాఠశాలకు వెళ్లే క్రమంలో మాయమాటలు చెప్పి ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశాడు. స్థానికులు వీఆర్ఏను పట్టుకొని దాడి చేశారు. బాలిక పాఠశాలలో ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేసింది. అనంతరం తల్లిదండ్రులకు విషయం తెలియడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. తిరుపాలు ప్రవర్తన గతంలో కూడా బాగాలేదని అధికారులు, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రాత్రి ఓ సామాజిక వర్గానికి చెందిన వారిపై బాలిక కుటుంబసభ్యులు, బంధువులు దాడికి యత్నించగా, పోలీసులు అడ్డుకొని శాంతింపచేశారు. ఎలాంటి గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ హేమాద్రి పేర్కొన్నారు.



వేధింపులు తట్టుకోలేకపోతున్నా..

● అమ్మానాన్నా క్షమించండి

● లేఖ రాసి, సెల్ఫీ వీడియో తీసుకుని..

● కదిరిలో యువకుడి బలవన్మరణం



ఉదయ్‌కుమార్


కదిరి పట్టణం, న్యూస్‌టుడే: 'పోలీసులు, ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతుల తల్లిదండ్రుల వేధింపులు భరించలేకపోతున్నా. అమ్మానాన్నా నన్ను క్షమించండి. నేను చనిపోతున్నా' అంటూ ఓ యువకుడు లేఖ రాసి, సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యులు, లేఖ, సెల్ఫీ వీడియోలో ఉన్న వివరాల మేరకు.. కదిరి మండలం యర్రదొడ్డికి చెందిన ఉదయ్‌కుమార్(35) శుక్రవారం గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గతంలో కదిరిలో సీఐగా పని చేసిన మధు, తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట సీఐ శ్రీనివాస్‌ల వేధింపులతోనే బలవన్మరణానికి పాల్పడుతన్నట్లు అందులో పేర్కొన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున చెట్టుకు వేలాడుతున్న కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు హతాశులయ్యారు. మూడేళ్ల తర్వాత ఇలా చూడాల్సి వచ్చిందా నాయనా అంటూ గుండెలవిసేలా రోదించారు. ఉదయ్‌కుమార్ సిద్దిపేటలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసేవాడు. మూడేళ్ల కిందట అదే ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమించాడు. కదిరికి తీసుకొచ్చి పెళ్లి చేసుకున్నాడు. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదుతో అతనిపై సిద్దిపేట, కదిరిలో కేసు నమోదైంది. పోలీసులు యువకుడితోపాటు అతడి సోదరుడిని అదుపులోకి తీసుకున్నారు. సదరు బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు తమ కుమారుడిని తీవ్రంగా కొట్టారని తల్లిదండ్రులు ఆరోపించారు. వారి దెబ్బలకు చెవి వినికిడి కోల్పోయాడని వాపోయారు.

పోలీసులపై జిల్లా న్యాయస్థానంలో ఫిర్యాదు..

ఉదయ్‌కుమార్ జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోలీసులపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఆ కోపంతో పోలీసులు తమతోపాటు కుమారుడిని వేధింపులకు గురి చేశారని కుటుంబసభ్యులు తెలిపారు. 'కేసును వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చారు. తెల్ల కాగితాలపై సంతకాలు చేయాలంటూ హింసించారు. మీ అంతు చూస్తామంటూ బెదిరించారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్‌ప్రసాద్ దృష్టికి పోలీసుల చర్యలను తీసుకెళ్లాం. పోలీసుల వేధింపులతో ఉదయ్ తెలంగాణలోనే ఉండిపోయాడు' అని చెప్పారు. బాలిక దూరమయ్యాక అతడు తెలంగాణలోని భద్రాచలం, హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన ఇద్దరు యువతులను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వివిధ కారణాలతో వారిద్దరూ దూరమయ్యారు. పోలీసులు, యువతుల కుటుంబ సభ్యులు బెదిరించడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియో, సూసైడ్‌నోట్‌లో పేర్కొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి సీఐ నారాయణరెడ్డి తెలిపారు.



వృద్ధ రైతుపై సీఐ దాడి



శ్రీనివాసరెడ్డి

పామిడి: కొత్తపల్లి గ్రామానికి చెందిన 70 ఏళ్ల రైతు బంగారు శ్రీనివాసరెడ్డిపై సీఐ యుగంధర్ పత్రికల్లో రాని భాషలో భూతులు తిట్టి దాడి చేశాడు. తనకు జరిగిన అన్యాయాన్ని ఆ రైతు సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియోను పోస్ట్ చేశాడు. దీనికి సంబంధించి బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైతుకు సంబంధించి ఓ స్థలం వివాదంలో ఉంది. గత సోమవారం తనకు న్యాయం చేయాలని 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'లో ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును అక్కడి నుంచి పామిడి పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈక్రమంలో సీఐ యుగంధర్ శ్రీనివాసరెడ్డి రైతును స్టేషన్‌కు పిలిపించి మొదటగా తనను కలవకుండా ఎస్పీ కార్యాలయానికి ఎందుకు వెళ్లావని దుర్భాలాడుతూ దాడికి పాల్పడ్డాడని, తన చరవాణిని ధ్వంసం చేశాడని బాధితుడు ఆరోపించారు. కనికరం లేకుండా 70 ఏళ్ల వృద్ధాప్యంలో ఉన్న తనపై దాడి చేశాడని కన్నీటిపర్యంతమయ్యారు. సీఐపై జిల్లా ఎస్పీ జగదీశ్ చర్యలు తీసుకోవాలని రైతు కోరుతున్నారు. ఈఘటనపై సీఐ యుగంధర్‌ను వివరణ కోరగా 2002 నుంచి ఉన్న స్థల వివాదం కావడంతో అగ్రిమెంట్‌తో ఈ సమస్యను కోర్టులో పరిష్కరించుకోవాలని సూచించాను. ఆయనపై దాడి చేయాల్సిన అవసరం తనకు లేదని ఆయన స్పష్టం చేశారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



వర్ష

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: బీటెక్ విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పటాన్‌చెరు ఠాణా పరిధిలో ఈ ఘటన జరిగింది. సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురానికి చెందిన విద్యుత్ శాఖ ఉద్యోగి నాగరాజు రెండో కుమార్తె వర్ష(19) పటాన్‌చెరు మండలం గీతం విశ్వవిద్యాలయంలో బీటెక్ సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. వర్ష మరో ఇద్దరు విద్యార్థినులతో కలిసి గీతం బాలికల వసతిగృహంలో ఉంటోంది. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో తాను ఉండే గదిలోకి వెళ్లి ఉరి పోసుకుంది. కొద్దిసేపటికి సహచర విద్యార్థినులు తలుపు ఎంతకొట్టినా తీయకపోవడంతో వాచ్‌మెన్ చూసి తలుపు పగలగొట్టి లోపలకు వెళ్లగా ఫ్యాన్‌కు వర్ష వేలాడుతూ కన్పించింది. వెంటనే కిందకు దింపి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వర్ష ఎప్పుడూ చదువుతూనే ఉండేదని, ఎవరితోనూ మాట్లాడేది కాదని.. ఎప్పుడూ ఒంటరిగానే ఉండేదని సహచర విద్యార్థినులు చెబుతున్నారు. బహుశా ఒత్తిడితో చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా అనంతపురం నుంచి వస్తున్నారని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని తెలిపారు.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

రాష్ట్ర విద్యావిధానం కావాలంటూ ర్యాలీ



మడకశిరలో నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

మడకశిర, న్యూస్‌టుడే: జాతీయ విద్యావిధానం(ఎన్‌ఈపీ) వద్దు, రాష్ట్ర విద్యావిధానం కావాలంటూ మడకశిరలో శుక్రవారం ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ నిర్బంధంగా రాష్ట్రాలపై నూతన జాతీయ విద్యావిధానాన్ని రుద్దడం తగదని విద్యార్థి సంఘం నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర విద్యావిధానాన్ని తయారు చేసి పాఠశాలలను, కళాశాలలను, విశ్వవిద్యాలయాలను కాపాడాలంటూ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకుడు సి.పరశురాముడు, పునీత్, రమేశ్, అనిల్, కార్తీక్, హర్ష, విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చని చెట్టుకు విద్యుత్తు కాటు..!



సోమందేపల్లి మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో నాటిన విద్యుత్తు స్తంభం స్టే వైరును సంబంధిత అధికారులు, సిబ్బంది తాత్కాలికంగా రహదారి పక్కనున్న చెట్టుకు కట్టారు. భూమిలో పాతకుండా అలాగే వదిలేశారు. ఈ విషయంపై ఏఈ సంజీవప్ప మాట్లాడుతూ పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

–న్యూస్‌టుడే, సోమందేపల్లి

టీపీఎస్‌గా అలివేలమ్మ

హిందూపురం పట్టణం,న్యూస్‌టుడే: మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టును ప్రభుత్వం భర్తీ చేసింది. టీపీఎస్‌గా అలివేలమ్మను నియమించారు. కల్యాణదుర్గంలో పని చేస్తున్న ఆమె బదిలీపై వచ్చి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

నేడు పుర కమిషనర్ బాధ్యతల స్వీకరణ

హిందూపురం పట్టణం : హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా సంగం శ్రీనివాసులు శనివారం బాధ్యతలు చేపట్టనున్నారు. అనంతపురం నగర పాలక సంస్థ కార్యదర్శిగా పని చేస్తున్న ఆయనను ఇటీవలే ప్రభుత్వం ఇక్కడికి కమిషనర్‌గా బదిలీ చేసింది. ఆయన శుక్రవారం అనంతపురంలో రిలీవ్ అయ్యారు.

తహసీల్దార్‌గా మారుతి..



గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల మండల తహసీల్దార్‌గా జి.మారుతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నెలరోజులుగా ఉపతహసీల్దార్ రెడ్డిశేఖర్ ఇన్‌ఛార్జిగా కొనసాగారు. ఈక్రమంలో అనంతపురం జిల్లా నుంచి శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీపై వచ్చిన మారుతి గోరంట్ల బాధ్యతలు తీసుకున్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

సోమందేపల్లి: అప్పులు చేసి వివిధ పంటలు సాగు చేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల నాయకులు రంగప్ప, రాజగోపాల్, చాంద్‌బాషా, నారాయణస్వామి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

ఇంటి స్థలం కబ్జాపై ఫిర్యాదు

అగళి : మధూడిలో జ్యోతి, సుమలకు జగనన్న కాలనీలో ఇంటి పట్టా మంజూరైంది. ఆ స్థలంలో మరో వ్యక్తి ఇల్లు కంటేందుకు పునాది వేశాడని బాధితులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ సుబ్బారావు ఫిర్యాదు చేశారు.

ఇంటర్ విద్యార్థినులకు వ్యాసరచన

రొద్దం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మద్దిలేటి, ఎస్ఎస్ఎస్ పీవో చందాబాషాల ఆధ్వర్యంలో '2047 నాటికి స్వర్ణాంధ్ర రాష్టంగా అబివృద్ధి చెందాలంటే ఏం చేయాలి' అనే అంశంపై శుక్రవారం ఇంటర్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అధ్యాపకులు భాగ్యలక్ష్మి, అంజలిదేవి పర్యివేక్షించారు.

విప్లవాత్మక మార్పునకు స్వర్ణాంధ్ర విజన్

అగళి : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు విప్లవాత్మక మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో స్వర్ణాంధ్ర విజన్-2047, వికసిత్ భారత్ కార్యక్రమం చేపట్టారని ఎంపీడీవో రవిప్రసాద్ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఏపీ విజన్ 2047ను ప్రజలు, ప్రజాప్రతినిధులు అధికారులందరూ రాష్ట్ర పునర్నిర్మాణం కోసం అందరు భాగస్వామ్యం కోరారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మడకశిర గ్రామీణం : పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్య పెంపొందుతుందని ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ సరోజినిదేవి పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులచేత అవగాహన ప్రదర్శన నిర్వహించారు.

ఎంఈవో బాలికల పాఠశాల దత్తత

గోరంట్ల : ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలతో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి ఎంఈవో జాన్‌రెడ్డెప్ప స్థానిక బాలికల ఉన్నత పాఠశాలను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం పాఠశాలలో సమావేశం నిర్వహించి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు.

వైద్యుల కొరత.. సేవలు అందక

మాతాశిశు ఆసుపత్రికి ఇద్దరే దిక్కు..

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: హిందూపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలలోని మాతాశిశు ఆసుపత్రికి మళ్లీ వైద్యుల సమస్య వేధిస్తోంది. ఇప్పటివరకు నలుగురు గైనకాలజిస్టులు ఈ కేంద్రంలో విధులు నిర్వహిస్తుండగా ఒక వైద్యురాలు మెటర్నటి సెలవులో వెళ్లటం, మరో వైద్యుడు నెలరోజులు మెడికల్ లీవ్‌లో వెళ్లారు. దీందో ఇద్దరే వైద్యులు మిగిలారు. ఓ పక్క ఆసుపత్రి సేవలు పూర్తి స్థాయిలో ప్రజలకు అందించాలని ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ తీసుకొంటున్న సందర్భంగా వైద్యుల కొరత ఏర్పడటం గమనార్హం. నలుగు వైద్యులు ఉన్నప్పుడు పూర్తిస్థాయిలో లేకున్నా కొంతమేర వైద్య సేవలు అందాయి. ప్రస్తుతం ఇద్దరే ఉండటంతో ప్రతి రోజు పగలు రాత్రి విధులు నిర్వహించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ ప్రసవాలు చేయటానికి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో ఇతరప్రాంతాల వారు ఇక్కడికే అధికంగా వస్తున్నారు. వీరికి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలంటే పూర్తి స్థాయిలో వైద్యులు ఉంటేనే సాధ్యమవుతోంది. అరకొర వైద్యులతో కేంద్రంలో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందటం కష్టం అంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే బాలకృష్ణ చర్యలు తీసుకొని ఈ కేంద్రంలో పూర్తి స్థాయిలో వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

సూపరింటెండెంట్ వైఖరే కారణమా ?

ఆసుపత్రి సూపరింటెండెంట్ బాధ్యతలు సీనియర్లను కాదని జూనియర్ వైద్యుడికి కట్టబెట్టారు. దీనిపై ఇప్పటికే సీనియర్ వైద్యుల్లో అసంతృప్తి నెలకొందనే ఆరోపణలు ఉన్నాయి. మాతాశిశు ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు చేస్తూ అందుబాటులో ఉంటున్న వైద్యుడు నెలరోజులు మెడికల్ లీవ్‌లో వెళ్లటం ఆసుపత్రి వర్గాల్లో చర్చనీయాంశమైంది.

సెలవుపై వెళ్లారు..

సర్జన్, గైనకాలజిస్ట్ బాబాబుడేన్ ఆరోగ్య కారణాల దృష్ట్యా నెల రోజులు మెడికల్ లీవ్‌లో వెళ్లారు. తన వైఖరిపై సీనియర్లు అసంతృప్తితో లేరు. ఇది కేవలం కల్పితం మాత్రమే. తాను సీనియర్లకు తగిన గౌరవం ఇస్తూ ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు తీసుకొంటన్నాను. **-రోహిల్‌కుమార్, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, హిందూపురం**



హిందూపురంలోని మాతాశిశు ఆసుపత్రి

కేంద్రం బసవతారకరామ మతాశిశు ఆసుపత్రి

ఉండాల్సిన వైద్యులు : 4 ఉన్న గైనకాలజిస్టులు : 2

ప్రతి రోజూ గైనిక్ ఓపీ : 100

చికిత్స పొందుతున్న బాలింతలు, గర్భిణులు : 60 - 70 మంది

నెలకు ప్రసవాలు : దాదాపు 200 (ఇందులో 100 దాకా సిజేరియన్)

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: జంగాలపల్లిలో నీరు వృథా అవుతోంది. **-శ్రీనివాసులు.**
సమాదానం: పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు చేయిస్తాం. **-ఆదినారాయణ, కార్యదర్శి, హొన్నంపల్లి.**
సమస్య: ఊటకూరు పేట వీధిలో దీపాలు వెలగడం లేదు. **-నరసింహ**
సమాధానం: కొత్తవి ఏర్పాటు చేయిస్తాను. **-దిలీప్‌కుమార్, సర్పంచి**
సమస్య: బయన్నపల్లిలో రహదారిపై మురుగు. **- నాగరాజు**
సమస్య: కంచిసముద్రం ఎస్సీ కాలనీలో చెత్త కుప్పలు. **-శాంతమ్మ.**
సమాధానం: మురుగు తొలగింపజేస్తాం. కంచిసముద్రంలో వీధులను శుభ్రం చేయిస్తాం. **-రమేష్, కార్యదర్శి, కంచిసముద్రం.**
సమస్య: వజ్రహట్టి వంకపై మోరీని పునర్నిర్మించాలి. **-లోకేశ్**
సమాధానం: ప్రతిపాదనలు పంపుతాం. **-రామారావు, ఎంపీడీఓ**
సమస్య: మద్దనకుంట పాఠశాలలో పిచ్చిమొక్కలు పెరిగాయి. **-వీరముద్దప్ప**
సమాధానం: పిచ్చిమొక్కలు తొలగిస్తాం. **-పోతిరెడ్డి, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు, మద్దనకుంట.**

–న్యూస్‌టుడే, పరిగి, లేపాక్షి, గుడిబండ

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించి పంటలు సాగుచేయడం వలన ఆరోగ్యకరమైన దిగుబడులతో పాటు రైతులకు మంచి లాభం చేకూరుతుందని జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు పేర్కొన్నారు. మండలంలోని జిల్లెడుగుంట గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో రైతులు సాగుచేసిన పత్తి పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంట సాగుచేయడం వలన మిత్రుపురుగులు అభివృద్ధి చెంది పురుగుల మందులు తగ్గించుకోవచ్చన్నారు.

రొళ్ల : మండలంలో రైతులు పండించి పంటకు వచ్చే మూడు రోజుల్లోపు 100 శాతం ఈకేవైసీ పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వైవీ సుబ్బారావు సూచించారు. శుక్రవారం హులికుంట గ్రామం రైతులు పండించిన పంటలను పరిశీలించారు. అనంతరం స్వయంగా గోవిందప్ప భార్యతో ఈకేవైసీ చేయించారు. సహాయ వ్యవసాయ సంచాలకుడు కృష్ణమీనన్, మండల వ్యవసాయాధికారి తిమ్మప్ప, ఏపీసీఎన్ఎఫ్ ఏఓ కృష్ణ చైతన్య, ఎంటీ రమేశ్, రైతు సేవాకేంద్రం సిబ్బంది శ్రీరామ్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.



పత్తి పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు, సిబ్బంది

తెదేపాతోనే అన్నివర్గాలకు సమన్యాయం

● సీఎం చిత్రపటానికి మైనార్టీ సోదరుల క్షీరాభిషేకం



ఎన్టీఆర్ కూడలిలో కేకు కోస్తున్న మైనార్టీ సోదరులు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలోనే అన్ని మతాలకు సమన్యాయం జరుగుతుందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి షఫీవుల్లా పేర్కొన్నారు. మైనార్టీ సోదరులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలను వర్తించేయటాన్ని హర్షిస్తూ శుక్రవారం ఎన్టీఆర్ కూడలిలో ప్రార్థనలు చేసి, కేక్‌కోసి, పేదలకు రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా షఫీవుల్లా, పట్టణ పార్టీ అధ్యక్షుడు డీఈ రమేశ్‌కుమార్‌లు మాట్లాడుతూ హజ్‌యాత్రకు వెళ్లేవారికి రూ.లక్ష, ఇమామ్‌లకు రూ.10వేలు, మసీదుల మరమ్మతులకు రూ.5వేలు ముఖ్యమంత్రి ప్రకటించటం మైనార్టీల పట్ల ఆయనకు ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. వైకాపా పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని ప్రస్తుతం సీఎం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో ముతవల్లి నూరుల్లా, నాయకులు అమర్‌నాథ్, హెచ్ఎన్ రాము, కౌన్సిలర్ ఇర్షాద్, మైనార్టీ నాయకులు అజ్మతుల్లా, నబీరసూల్, బాషా, ముబారక్ లు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

పెనుకొండ పట్టణం : ఇటీవల పెనుకొండ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎ.శ్రీనివాసులు పదోన్నతి పై శ్రీసత్యసాయి జిల్లా అదనపు ఎస్పీగా వెళ్లడంతో, శుక్రవారం పెనుకొండ డీఎస్పీగా వై.వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. కర్నూల్ రేంజ్ ఇంటలిజెన్స్ విభాగం నుంచి బదిలీపై వచ్చి ఇక్కడ డీఎస్పీగా చేరారు. అనంతరం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖమంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మంత్రిని కలిసిన అధికారులు

పెనుకొండ పట్టణం : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన బదిలీల్లో పెనుకొండకు వచ్చిన వివిధ శాఖల ఉద్యోగులు శుక్రవారం రాష్ట్ర బీసీసంక్షేమశాఖ మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చిలమత్తూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న టి.ఆనంద్‌ను పెనుకొండ ఆర్డీవోగా నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. శుక్రవారం ఆయన మంత్రి సవితను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ప్రాచీన కట్టడాల సంరక్షణ బాధ్యత అందరిది

పెనుకొండ పట్టణం : ప్రాచీన కట్టడాలు, వాటి పరిసరాలను సంరక్షించాల్సిన బాధ్యత బావిభారత పౌరులందరిపై ఉందని స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కేశవరావు అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కళాశాల చరిత్రశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ చరిత్ర ఆనవాళ్లుగా నిలిచిన కట్టడాలను సందర్శించి, అందులోని విషయ పరిజ్ఞాన్ని తెలుసుకోవాలని సూచించారు. కళాశాల వైస్‌ప్రిన్సిపల్ జయప్ప, చరిత్ర అధ్యాపకుడు ప్రతాప్, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం.. అధ్వానం



హిందూపురం పట్టణంలోని సూరప్పకుంట నుంచి రహమత్‌పూర్ సర్కిల్‌కు వెళ్లే రహదారిలో, పాండురంగనగర్ రోడ్డుకు వెళ్లే సమీపాన ఉన్న కాలువ చెత్త, ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయింది. చుట్టుపక్కల వారు రాత్రి సమయాల్లో ఇంటిలోని చెత్తాచెదారాన్ని ఇక్కడ వేసి వెళ్లిపోతున్నారు. ఆదారిలో వెళ్లాలంటే దుర్వాసన వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌ఛార్జి కమిషనర్ సునీల్‌ను వివరణ కోరగా పారిశుద్ధ్య కార్మికులను పంపి తొలగిస్తామన్నారు.

–న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్

రొద్దం: మహాత్మాగాంధీ జ్యోతిబా పులే గురుకుల పాఠశాలలో శుభ్రత నీరంతా బయటకు వెళ్లే మార్గంలేక ఆవరణలో నిలిచి మురుగుగా మారి దుర్వాసన వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. కొన్ని నెలల నుంచి ఈ పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులతోపాటు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అన్న క్యాంటీన్ ప్రారంభానికి సిద్ధం



పేదలకు అన్నం పెట్టడానికి ఏర్పాటుచేసిన అన్నక్యాంటీన్ మడకశిరలో ప్రారంభానికి సిద్ధమైంది. అక్టోబరు 3న ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ ఏఈ మురళీధర్ తెలిపారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఐదేళ్లుగా మూతపడ్డ అన్నక్యాంటీన్ భవనం ప్రారంభిస్తారని తెలియడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, మడకశిర

విద్యార్థుల ఆరోగ్యానికి పోష్టికాహారం దోహదం

రొద్దం, న్యూస్‌టుడే : విద్యార్థుల ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కసూర్బా విద్యాలయాన్ని ఆమెతోపాటు జిల్లా ప్రత్యేక అధికారిణి సంపూర్ణ తనిఖీ చేశారు. పాఠశాలలో 258 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వసతి గదులతో పాటు, తరగతి గదులు, పరిసరాలను అధికారులు పరిశీలించారు. ఆహార పట్టిక ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు విద్యార్థినులు అధికారులతో చెప్పారు. ఆవరణంలో సేంద్రియ ఎరువులతో సాగు చేసిన ఆహార ఉత్పత్తులతో మరింత ప్రయోజనకరంగా ఉండడం చూసిన డీఈవో భేష్ అంటూ ఎస్‌వో నాగరత్నమ్మను మెచ్చుకున్నారు. మండల విద్యాధికారి -2 జయభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.



పెరటి తోటను పరిశీలిస్తున్న డీఈవో మీనాక్షి

అమరాపురం : విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని వండి వడ్డించాలని డీఈవో మీనాక్షి, జీసీడీవో సంపూర్ణలు తెలిపారు. శుక్రవారం రాత్రి అమరాపురం కేజీబీవీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థినులకు వండిన అన్నం, కూరలను రుచి చూశారు. పిల్లలను బాగా చూసుకోవాలని, పతో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటినుంచే ప్రణాళికబద్ధంగా బోధన చేయాలన్నారు. ఎస్‌వో శోభారాణి, ఎంఈవో రాఘవయ్య పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: మద్యానికి బానిసైన హిందూపురం గ్రామీణ మండలం చలివెందులకు చెందిన సి.పురుషోత్తం(24) శుక్రవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు. ప్రైవేట్ కొరియర్ పరిశ్రమలో పనిచేస్తున్న ఇతను కొంత కాలం కింద ప్రమాదానికి గురై ఇంట్లోనే ఉంటున్నాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొన్నాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై జయరామరెడ్డి తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

పెనుకొండ పట్టణం : కోనాపురం గ్రామానికి చెందిన సోమశేఖర్‌రెడ్డి గురువారం రాత్రి మిద్దెపై నుంచి పడి తీవ్రగాయాల పాలయ్యాడు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా అక్కడికి వెళ్లగానే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య విజయలక్ష్మి, కుమారుడు మనోజ్‌కుమార్‌రెడ్డి, కుమార్తె అహిల ఉన్నారు.

దండురోడ్డుకు మోక్షమెన్నడు?

సమీప కాలనీలు: 7 నివాసగృహాలు: 2134. జనాభా: 8540 మంది

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: హిందూపురం పురపాలక సంఘం పరిధిలో మేళాపురం నుంచి ముద్దిరెడ్డిపల్లి వరకు ఉన్న రాజుల కాలం నాటి దండు రోడ్డు సిమెంటు రోడ్డుగా రూపాంతరం చెందాలంటే నిర్మాణం పూర్తయ్యేదెన్నడోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణం నుంచి ముద్దిరెడ్డిపల్లి వరకు రెండు కిలోమీటర్ల దూరం కొనసాగే ఈ రహదారికి సిమెంటు రోడ్డు వేయాలని 2017లో పనులు ప్రారంభించారు. కొట్నూరు చెరువు కట్టకాలువ వరకు గతంలో వేసిన సిమెంటు రోడ్డు ఉంది. ఆ తర్వాత అర కిలోమీటరు వేశాక కొన్ని కారణాలతో పనులు ఆగిపోయాయి. 2019లో వైకాపా ప్రభుత్వం వచ్చినా పనులు పునఃప్రారంభించలేదు. ఇప్పటివరకు మట్టిరోడ్డే శరణ్యమైంది. వర్షం వస్తే చాలు నీరు చేరి కిలోమీటరు దూరం బురదమయమై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పట్టుచీరల తయారీ పరిశ్రమలు, కల్యాణమండపాలు, దేవాలయాలు, మున్సిపల్ పాఠశాలలు ఉన్నందున ఉదయం నుంచి రాత్రి దాకా రద్దీగా ఉంటుంది. ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలోనైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయిస్తారమేనని ప్రజలు ఆశిస్తున్నారు.



అరకిలోమీటరు వరకే సిమెంటు నిర్మాణం జరిగిన దండురోడ్డు

తరచూ చిన్న ప్రమాదాలు



భార్గవరాముడు, పట్టుచీరల వ్యాపారి, ముద్దిరెడ్డిపల్లి

దండురోడ్డు పూర్తిస్థాయిలో సిమెంటు నిర్మాణానికి నోచుకోకపోవడంతో వర్షాకాలంలో రోడ్డంతా బురదగుంతలుగా తయారై వాహనాల్లో వెళ్లేవారు తరచూ చిన్నపాటి ప్రమాదాలకు గురవుతున్నారు. మున్సిపల్ పరిధిలోని ఈ రోడ్డు చివర నుంచి ముద్దిరెడ్డిపల్లి పాతూరుకు సిమెంటు రోడ్డు నిర్మాణం చేస్తే ప్రజలకు అనుకూలంగా ఉంటుంది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

సునీల్, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్

ఆగిపోయిన దండురోడ్డు పిమెంటు నిర్మాణ పనులను పరిశీలించి సంబంధిత అధికారులు, ఇంజినీర్లతో సంప్రదించి చర్యలు తీసుకుంటాం. ఆగిపోవడానికి కారణాలు, తదుపరి పనులు ఎందుకు ప్రారంభించలేదు. నిధులు ఈ మేరకు ఉన్నాయి, ఇతరత్రా విషయాలను సేకరించి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపుతాం. ఆదేశాల వచ్చిన వెంటనే అందరి సమన్వయంతో సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా ప్రయత్నాలు చేస్తాం.

దుకాణాల్లో చోరీ..

గోరంట్ల, న్యూస్‌టుడే: స్థానిక హిందూపురం రహదారిలో ఎస్‌బీఐకి సమీపంలో రెండు దుకాణాల్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. పైభాగంలో రేకులను పగుల గొట్టి లోపలికి ప్రవేశించాడు. ఈ సందర్భంగా షాకీర్‌కు చెందిన రెడీమెడ్ దుకాణంలో కొంత నగదు, 25 జతల దుస్తులు, ఓ సెల్‌ఫోన్.. అఫ్జల్‌కు చెందిన ఆటో మొబైల్ దుకాణంలో రూ.5 వేల నగదు, ఎలక్ట్రికల్ సామాగ్రి, ఎత్తుకెళ్లినట్లు బాధితులు వివరించారు. షాకీర్ దుకాణంలో ఎత్తుకెళ్లిన చరవాణి స్విచ్ ఆఫ్ చేయకుండా అలాగే పెట్టుకోవడంతో టవర్ లోకేషన్ ఆధారంగా దొంగ దొరికాడు. పోలీసులు చోరున్ని కదిరిలో అదుపులోకి తీసుకుని గోరంట్లకు తీసుకొచ్చారు. ప్రస్తుతం విచారిస్తున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు.

కలగానే జయమంగళి వంతెన



కాజ్‌వేపై ప్రవహిస్తున్న జయమంగళి నది (పాత చిత్రం)

శ్రీరంగరాజుపల్లి (పరిగి), న్యూస్‌టుడే: మండల పరిధిలోని శ్రీరంగరాజుపల్లి గ్రామ సమీపంలో జయమంగళి నదిపై చేపట్టనున్న వంతెన నిర్మాణం కలగా మిగిలి పోయింది. 2021-22 లో కర్ణాటక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు జయమంగళి నది ఉప్పొంగి ప్రవహించింది. శ్రీరంగరాజుపల్లి గ్రామ సమీపంలో జయమంగళి నదిపై నిర్మించిన కాజ్‌వే నీటి ఉద్ధృతికి కోతకు గురై కొంతమేర కొట్టుకుపోయింది. దీంతో బస్సులు, వాహన రాకపోకలు స్తంభించి పోయాయి.

ప్రకటనలకే నాటి మంత్రి హామీ

అప్పటి వైకాపా ప్రభుత్వంలో మంత్రి శంకరనారాయణ జయమంగళి నదిపై వంతెన నిర్మాణానికి అవసరమైన రూ.3 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ ఒక్కరూపాయి విడుదల చేయలేదు. శ్రీరంగరాజుపల్లి, పాపిరెడ్డిపల్లి, మడకశిర మండలం ముళ్లమోతుకపల్లి గ్రామాల నుంచి ప్రతి నిత్యం వివిధ పనుల నిమిత్తం ప్రజలు హిందూపురం పట్టణానికి ఆర్టీసీ బస్సులోనూ, ఆటోలలో వెళుతుంటారు. వరద నీటి ప్రవాహం వల్ల నదిపై నిర్మించిన కాజ్‌వే దెబ్బతింది. కోతకు గురైన కాజ్‌వే మట్టితో నింపి తాత్కాలికంగా మరమ్మతులు చేశారే కాని ఇప్పటికీ నిధులు మంజూరు చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా జయమంగళి నదిపై వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వరద వస్తే సంబంధాలు తెగిపోతాయి



-ఆనందప్ప, శ్రీరంగరాజుపల్లి

దశాబ్ద కాలంగా జయమంగళి నదిపై వంతెన నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. నదికి వరదలు వస్తే హిందూపురం వెళ్లాలన్న 12 కిలోమీటర్లు చుట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి జయమంగళి నదిపై వంతెన నిర్మాణాన్ని చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలి.

ప్రతిపాదనలకు ఆదేశించా : మంత్రి సవిత.

వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించాను. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జయమంగళి నదిపై వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయిస్తాను.

పుట్టపర్తి
•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



రామమూర్తిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

బత్తలపల్లి, న్యూస్‌టుడే: పుట్టపర్తిలో ఈ నెల 5న కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్న రామమూర్తిని తోటి ఉపాధ్యాయులు శుక్రవారం సన్మానించి, అభినందించారు. బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఆయన్ని సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేంద్ర, ఉపాధ్యాయులు వెంకటనారాయణ, ఓబిరెడ్డి, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళదాం



మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని తెదేపా కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. చేనేత కార్మికుల ఇళ్లకు ప్రభుత్వం విద్యుత్తు రాయితీ ఇస్తుందని, చేనేత పథకాల గురించి ప్రజలకు తెలియజెప్పాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. తెదేపా పట్టణాధ్యక్షుడు పరిశే సుధాకర్, మహేశ్ చౌదరి, అంబటి సనత్, తెలగాల శ్రీనివాసులు, లక్ష్మినారాయణ, భీమనేని ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకంతో వినోదం.. విజ్ఞానం

కదిరి, న్యూస్‌టుడే: పర్యాటకం వినోదం, విజ్ఞానాన్ని అందిస్తుందని ప్రిన్సిపల్ స్నిత తెలిపారు. కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడారు. పర్యటనలతో ఆయా ప్రాంతాల్లోని భాషలు, కళలు, సంస్కృతులు, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, కట్టుబాట్లపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు చెన్నారెడ్డి, రవీంద్ర, నజీన్ సహీదా, హైదర్‌వలి, శివప్రసాద్, నరసింహాచారి, శంకర తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం స్ఫూర్తిదాయకం

ధర్మవరం, న్యూస్‌టుడే: రక్తదానం మహోన్నత ప్రాధాన్యం అవుతుందని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శైలజ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ధర్మవరం సోషల్ మీడియా నిర్వాహకులు ప్రదీప్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రిన్సిపల్ ప్రారంభించారు. 23 మంది యువకులు రక్తదానం చేశారు. వైద్యులు వెంకటేశులు, శ్రీహరి, కౌన్సిలర్ కేతా లోకేష్, కన్నా వెంకటేష్, పోతులయ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై మంత్రికి వినతి

ధర్మవరం, న్యూస్‌టుడే: వైద్యఆరోగ్యశాఖలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, నరేంద్రరెడ్డి వినతిపత్రం అందజేశారు. కమిటీ సభ్యులు నిర్మల, రాజేశ్వరి, సురేంద్రనాయక్, తిరుపాల్, రవి, మారుతి, చంద్రయ్య పాల్గొన్నారు.

'నిబంధనల మేరకే చీరల తయారీ'

ధర్మవరం, న్యూస్‌టుడే: మరమగ్గాలపై చేనేత రకాలు తయారు చేస్తున్నారని జె.ఆర్.శిల్క్స్ పరిశ్రమపై ఏపీ చేనేత కార్మిక సంఘం, సీఐటీయూ, సీపీఎం నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఆ పరిశ్రమ అధినేత జింకా రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెల్దుమడుగు వద్ద ఉన్న పరిశ్రమలో తాము ప్రభుత్వ నిబంధనలకు లోబడి చీరలు తయారీ చేస్తున్నామని ఆయన తెలిపారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అతిక్రమించలేదని పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీని కలిసిన నూతన సీఐ

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పుట్టపర్తి మహిళా పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన గోపీనాథరెడ్డి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రత్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్క అందజేశారు. కర్తవ్య నిర్వహణలో అంకితభావంతో పనిచేసి పోలీస్ ప్రతిష్ఠను పెంచేలా చూడాలని ఎస్పీ సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. కేసు నమోదు

బత్తలపల్లి న్యూస్‌టుడే: చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును జ్వాలాపురం వద్ద బత్తలపల్లి పోలీసులు పట్టుకున్నారు. దాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు కిందపడి కూలీ మృతి

రామగిరి, న్యూస్‌టుడే : ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కూలీ పై నుంచి కిందపడి మృతిచెందిన సంఘటన శుక్రవారం వెంకటాపురంలో చోటుచేసుకుంది. రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ తెలిపిన వివరాలు మేరకు మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన వడ్డే ఆంజనేయులు(34) వెంకటాపురంలో ఇంటి నిర్మాణ పనుల్లో పైకప్పు వేయడానికి ఏర్పాటు చేసిన సెంట్రింగ్ సీట్లు పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అనంతపురం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య భాగ్యమ్మ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

రేకుల షెడ్లు.. అరకొర వసతులు

■ సంక్షేమ వసతి గృహాల్లో దయనీయం
■ ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

కదిరి గ్రామీణం, ముదిగుబ్బ, న్యూస్‌టుడే: 'ఆర్థిక స్థోమత లేని తల్లిదండ్రులు తమ పిల్లలు మూడు పూటలా తిని చదువుకుంటారని ఆశతో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చేర్పిస్తుంటారు. తిండి, దుస్తులు, పుస్తకాలు, కాస్మోటిక్ ఛార్జీల కింద కొంత సొమ్ము ఇస్తారని భావిస్తారు. అయితే వసతి గృహాల్లో కనీస వసతులు కరవయ్యాయి. వాటిని అద్దె భవనాల్లో, అందులోనూ రేకుల షెడ్లలో నిర్వహిస్తుండటంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బంది వర్ణనాతీతం.'

కదిరి మండలం పట్నం బీసీ బాలుర వసతి గృహం, ముదిగుబ్బ మండలం యనుములవారిపల్లి బీసీ బాలుర వసతి గృహాలను గత రెండు దశాబ్దాలకుపైగా అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. 94 మంది విద్యార్థులు ఉన్న పట్నం బీసీ బాలుర వసతి గృహంలో కేవలం రెండు మరుగుదొడ్లు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. పాఠశాల సమయానికి విద్యార్థులందరూ హాజరు కావాలంటే బహిర్భూమికి వెళ్లాల్సిన దుస్థితి. మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో ఆ ప్రాంతం పూర్తి దుర్గంధం వస్తుంది. వాటికి తలుపులు విరిగిపోయాయి. విద్యుత్తు సౌకర్యం, నీటి సరఫరా లేదు. యనుములవారిపల్లి వసతి గృహంలో 110 మంది విద్యార్థులు ఉండగా కేవలం 6 మరుగుదొడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.



పట్నం వసతి గృహం ఇది. విద్యార్థులకు రెండు విశ్రాంతి గదులు ఉన్నాయి. వంట గది సమీపంలో ఉన్న గదినే విశ్రాంతికి వినియోగిస్తున్నారు. దీని పైకప్పు పూర్తిగా రేకులతో నిర్మించారు. విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

అనుకూలమైన భవనంలో నిర్వహణకు చర్యలు

పట్నం బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడటం, పాఠశాలకు వసతి గృహం దూరంగా ఉన్న విషయాన్ని ఇప్పటికే గుర్తించాం. పాఠశాలకు సమీపంలో భవనాన్ని ఎంపిక చేసి అక్కడికి మారుస్తాం. శాశ్వత భవనాలు లేని వసతి గృహాలను అద్దె భవనాల్లో నిర్వహించేందుకు మాత్రమే అవకాశం ఉంది.

- బాలాజీ, సహాయ బీసీ సంక్షేమ శాఖ అధికారి, కదిరి

యనుములవారిపల్లి వసతి గృహాన్ని రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. అందులో రెండు విశ్రాంతి గదులు ఉన్నాయి. పైకప్పు రేకుల నిర్మాణం కావడంతో ఎండ వేడిమికి, వేసవిలో ఉక్కపోతకు విద్యార్థులు అల్లాడుతున్నారు.



మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య: ముదిగుబ్బలోని ప్రధాన రహదారి, పాతూరు, దొరిగల్లు రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. **- రమేశ్, ముదిగుబ్బ**

సమాధానం: తగిన చర్యలు తీసుకుంటాం. **- ఖాదర్‌బాషా, ఈవోఆర్డీ**

సమస్య: ఎస్.బండ్లపల్లి గ్రామంలో తాగునీటి సమస్యను తీర్చాలి. **- గ్రామస్థులు**

సమాధానం: నియంత్రిక ఏర్పాటు చేసి పరిష్కరిస్తాం. **- ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ**

సమస్య: తహసీల్దార్ కార్యాలయంలోని కంప్యూటర్ గదిలో పైకప్పు పెచ్చులూడి ఇనుప చువ్వలు కనిపిస్తున్నాయి. **- సిబ్బంది**

సమాధానం: మరమ్మతులు చేయిస్తాం. **- మునిస్వామి, ఇన్‌ఛార్జి తహసీల్దార్**

– న్యూస్‌టుడే, ముదిగుబ్బ

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: 'ఇక్కడ స్వచ్ఛత నహీ' శీర్షికన ఈనెల 24 మున్సిపల్ కౌన్సిల్ హాలుపై వ్యర్థాల గురించి 'ఈనాడు'లో వార్త ప్రచురితమైన విషయం విదితమే. స్పందించిన మున్సిపల్ సిబ్బంది కౌన్సిల్ హాలుపై నెలల తరబడి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

బత్తలపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని, వాటిని సాకారం చేసుకునేందుకు కష్టపడి చదవాలని జడ్పీ సీఈవో ఓబుళమ్మ అన్నారు. పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని హెచ్‌ఎం నాగరత్నమ్మకు సూచించారు. శుక్రవారం ఆమె స్థానిక ఎంపీడీవో సాయి మనోహర్‌తో కలసి బత్తలపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర, బాలికల పాఠశాలలను పరిశీలించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతలు తవ్వి వర్షం నీటిని ఒడిసి పట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి పెద్ద శ్రీనివాసులు, పాఠశాల కమిటీ గౌరవాధ్యక్షుడు నాగభూషణం, విద్యా కమిటీ ఛైర్మన్ దాదా ఖలందర్, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, నాగరత్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఓబుళమ్మ





ధర్మవరం పట్టణం: ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు, కదిరిలో..

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఇతర శాఖల ఉద్యోగులకు వర్తించే పలు సౌకర్యాలు, ఉత్తర్వులు మున్సిపాలిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు వర్తించడం లేదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం యూటీఎఫ్ సంఘం నాయకులు ఎంఈవో రాజేశ్వరికి వినతి పత్రం అందజేశారు. ఎస్జీటీ, పండిత్, పీఈటీ ఉద్యోగాలను అప్‌గ్రేడ్ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామకృష్ణనాయక్, హరికృష్ణ, సాయిగణేశ్, లక్ష్మయ్య, రాంప్రసాద్, రామాంజనేయులు, ఆంజనేయులు, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు. **కదిరి:** యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి, భార్గవ, శ్రీనివాసులు, ఆజంబాషా, సునీల్‌కుమార్, అనిత, మానస, ఉష, ప్రత్యూష తదితరులు ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబుళరెడ్డిలకు వినతి పత్రం అందజేశారు.

భాజపా కార్యకర్తకు పరామర్శ



ప్రతాప్‌రెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని సప్తగిరి కూడలి వద్ద ఈ నెల 23న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వాహనం ఢీకొని గాయపడిన భాజపా కార్యకర్త ప్రతాప్‌రెడ్డిని శుక్రవారం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పరామర్శించారు. స్థానిక ప్రియాంక నగర్‌లోని ప్రతాప్‌నగర్ ఇంటికి వెళ్లిన మంత్రి జరిగిన ఘటనపై అడిగి తెలుసుకున్నారు. వైకాపా నాయకుల దౌర్జన్యాలు ఎంతోకాలం సాగవని, చట్టపరంగా వారిపై చర్యలు తప్పవని మంత్రి ఈ సందర్భంగా హెచ్చరించారు. ఆయన వెంట భాజపా నాయకుడు డోలా రాజారెడ్డి, మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీశ్ ఉన్నారు.

వృద్ధాశ్రమానికి బియ్యం వితరణ

అమడగూరు, న్యూస్‌టుడే: గాజులపల్లి సమీపంలోని శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమానికి తనకల్లు మండలం నాయునిచెరువు గ్రామానికి చెందిన జయసుధ, చంద్రమోహన్ కుటుంబ సభ్యులు శుక్రవారం 10 బస్తాల బియ్యాన్ని వితరణగా అందజేసినట్లు దాతలు, ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి తెలిపారు.

సంఘం సంక్షేమానికి కృషి

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: నాయీబ్రాహ్మణుల యూనియన్ సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తిలో సీఐటీయూ నాయీబ్రాహ్మణుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గంగాధర్, అధ్యక్షుడిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున, కార్యదర్శిగా గురుప్రసాద్, సహాయ కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా జయచంద్ర, సభ్యులుగా శ్రీనివాస్, గోపాల్, ప్రవీణ్, మహేష్, రమణ, సుధాకర్‌ను ఎనుకున్నారు.

నైపుణ్యం పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్తు

బుక్కపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే నైపుణ్యాన్ని పెంచుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విశ్రాంత ఐఎఫ్ఎస్‌సీ అధికారి రోమిల్, రిటైర్డ్ జనరల్ మేనేజర్ కరుణాకర్, పైలెట్ దినేశ్ తెలిపారు. బుక్కపట్నంలోని శ్రీసత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా వ్యక్తిత్వ వికాసంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం సేవా భావం అనే అంశంపై వివరించారు. విద్యార్థులు తల్లిదండ్రుల పట్ల గౌరవం, సామాజిక సేవను అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆర్ఎన్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.ఓబులేసు, ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ రాజమహమ్మద్, లైబ్రేరియన్ వెంకటేశ్వరప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్రాంత ఐఎఫ్ఎస్‌సీ అధికారి రోమిల్

ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

తలుపుల, న్యూస్‌టుడే: తలుపుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ప్రధాన ద్వారం వద్ద కొంతమంది ఆకతాయిలు విద్యార్థులను వేధిస్తున్నారంటూ విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కళాశాల, ఉన్నత పాఠశాల రెండింటికి ఒకే ద్వారం ఉండటంతో అక్కడ కొంతమంది ఆకతాయిలు ఉంటూ విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, వేధిస్తున్నారని పేర్కొన్నారు. ద్వారం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ రాముడు, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లకు మీటర్ల జీవో రద్దు చేయాలి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం అమలు చేసిన వ్యవసాయ మోటార్లకు మీటర్ల జీవోను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ రైతు సంఘం నాయకులు ఉప తహసీల్దార్ ఈశ్వరయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, అన్నదాత సుఖీభవ కింద రూ.20,000 ఖాతాలకు జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మారుతి, జేవీ రమణ, ఆదినారాయణ, నాగార్జున, నారాయణ, హరి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణులకు అభినందనలు

కదిరి, న్యూస్‌టుడే: నేటి నుంచి పొట్టిశ్రీరాములు జిల్లా వెంకటగిరిలో ప్రారంభం అవుతున్న అండర్-15 రాష్ట్రస్థాయి పోటీలకు దక్షిణ మండలం జట్టులో పాల్గొంటున్న తేజస్వినిని ఎమ్మెల్యే, కదిరి మండల క్రికెట్ సంఘం అధ్యక్షుడు కందికుంట వెంకటప్రసాద్ అభినందించారు. ఈ సందర్భంగా ఆమెకు టీషర్టు, బూట్లు, మరో క్రీడాకారిణి అర్షియాకు టీషర్టును క్రికెట్ సంఘం తరఫున అందజేశారు. కార్యక్రమంలో కోచ్ నజీర్, సీనియర్ క్రికెట్ ముబారక్, నరసింహమూర్తి, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు అధికారులు బాధ్యతల స్వీకరణ

బత్తలపల్లి, న్యూస్‌టుడే: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బత్తలపల్లి తహసీల్దార్‌గా స్వర్ణలత విధుల్లో చేరారు. ఆమె చిత్తూరు జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

నంబులపూలకుంట(గాండ్లపెంట): ఎన్పీకుంట డిప్యూటీ తహసీల్దార్‌గా దేవేంద్రనాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు తహసీల్దార్ నరేంద్రకుమార్, సిబ్బంది సాదారంగా ఆహ్వానించారు.

కొత్తచెరువు: మండల ఉప తహసీల్దార్‌గా బాల ఆంజనేయులు బాధ్యతలు తీసుకున్నట్లు తహసీల్దార్ నీలకంఠారెడ్డి తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న ఉప తహసీల్దార్ స్వాతిని పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయానికి బదిలీ చేశారు. కార్యాలయ సిబ్బంది నూతన డీటీకి స్వాగతం పలికి బదిలీపై వెళుతున్న డీటీకి వీడ్కోలు పలికారు.

తలుపుల: తలుపుల ఎఫ్ఎస్‌సీ తహసీల్దార్‌గా ఓబులదేవరచెరువు డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న డీటీ రవినాయక్ నల్లచెరువు మండలానికి బదిలీపై వెళ్లారు.

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కదిరి ఎంపీడీఓగా పోలప్ప శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా మొలకలచెరువు నుంచి బదిలీపై వచ్చారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను ఎంపీడీవో మర్యాదపూర్వకంగా కలిశారు.

గాండ్లపెంట: గాండ్లపెంట ఎంపీడీవోగా వెంకట్రామిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయన వైఎస్సార్ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఈఓఆర్డీ సునీత, పంచాయతీ కార్యదర్శులు మహబూబ్‌బాషా, రవికుమార్, శివశంకర్, మండల తెదేపా నాయకులు వెంకటరమణారెడ్డి, అక్రంబాషా, ఆనంద్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

కదిరి పట్టణం: కదిరి సబ్‌రిజిస్ట్రార్‌గా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న శిరీష పదోన్నతిపై వెళ్లారు. రాయదుర్గంలో పని చేస్తున్న సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసులును కదిరికి నియమించారు.

నీటి సమస్యకు పరిష్కారం



బోరులో నుంచి వస్తున్న నీరు

నల్లచెరువు(కదిరి), న్యూస్‌టుడే: మండలంలోని ఇందుకూరుపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. గత ఆగస్టులో పంతులచెరువులో జరిగిన గ్రామసభలో ప్రజలు నీటి సమస్యను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల పరిషత్, పంచాయతీ నిధులు కేటాయించి బోరుబావి తవ్వించి, మోటారు ఏర్పాటు చేశారు. దాంతో తాగునీటి సమస్య తీరినట్లైంది. **గాండ్లపెంట:** మండల పరిధిలోని వద్దిరెడ్డిపల్లిలో తాగునీటి సమస్య తలెత్తడంతో మాజీ సర్పంచి కాకర్ల రవీంద్రారెడ్డి బోరుబావి తవ్వించారు. అందులో రెండించుల దాకా నీరు పడ్డాయి. సమస్య తీరడతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ నిధులతో బోరు తవ్వించినట్లు ఆయన తెలిపారు.

గ్రామ సచివాలయ ఉద్యోగిపై దాడి

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చిన్నచిగుళ్లరేవు గ్రామ సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్ నిజాముద్దీన్‌పై మర్రిమాకులపల్లి గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి, లోకేశ్‌రెడ్డి శుక్రవారం దాడికి పాల్పడ్డారు. బాధితుడి వివరాల మేరకు.. మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ప్రభుత్వం ఉలవలు, అలసందలు, పెసలు పంపిణీ చేస్తోంది. అందులో భాగంగానే చిన్నచిగుళ్లరేవులోని గ్రామ సచివాలయంలో ఏవో రమాదేవి, అగ్రికల్చర్ అసిస్టెంట్ నిజాముద్దీన్ విత్తనాలను రైతులకు పంపిణీ చేపట్టారు. ఇదే సమయంలో ఈశ్వరరెడ్డి, లోకేశ్‌రెడ్డి సచివాలయానికి చేరుకుని విత్తనాలు ఇవ్వాలని అధికారులను అడిగారు. గతంలో చీనీ పంటకు బీమా చేయించుకున్నారని, విత్తనాలను తీసుకుంటే ఆ పథకం వర్తించదని అధికారులు సూచించారు. దాంతో వారిద్దరూ గొడవకు దిగారు. నిజాముద్దీన్‌పై చేయిచేసుకుని, హెల్మెట్‌తో దాడి చేశారు. బాధితుడు పక్కకు తప్పుకోగా సచివాలయం కిటికీ అద్దాలు పగిలి కంటికి గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. పోలీసులు ఉద్యోగుల నుంచి వివరాలు సేకరించారు. బాధితుడు, ఏవో రమాదేవి స్థానిక పోలీసులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

వార్డెన్‌పై చర్యలకు డిమాండ్



నిరసన తెలుపుతున్న గౌనిపల్లి బీసీ వసతిగృహ విద్యార్థులు

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: మండలంలోని గౌనిపల్లి బీసీ వసతిగృహ ఇన్‌ఛార్జి వార్డెన్ లక్ష్మీనారాయణపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజులనరేంద్ర, హాస్టల్ విద్యార్థులు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదన్నారు. ప్రశ్నిస్తే బెదిస్తున్నారని ఆరోపించారు. హాస్టల్‌లో ఫ్యాన్లు లేక ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు వాపోయారు. సమస్యలను ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇన్‌ఛార్జి వార్డెన్‌పై చర్యలు తీసుకుని, నూతన వార్డెన్‌ను నియమించాలని వారు కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు నంద, పవన్, కిశోర్, విద్యార్థులు హేమంత్, విజయ్‌కుమార్, మహేంద్ర, వరుణ్‌కుమార్, చరణ్, మోక్షిత్‌సింహా తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం గ్రామీణ ఎస్ఐగా పి.శ్రీనివాసులు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం గ్రామీణ ఎస్ఐ కె.నరేంద్రను రొద్దంకు బదిలీ చేస్తూ శుక్రవారం పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులును ధర్మవరం గ్రామీణ ఎస్ఐగా నియమించారు. బదిలీ అయిన ఎస్ఐలు వారికి కేటాయించిన స్థానాల్లో తక్షణం చేరాలని జిల్లా ఎస్పీ వి.రత్న ఉత్తర్వులు జారీ చేశారు.

నిధుల్లేక.. మరమ్మతులకు నోచుకోక

■ తుప్పు పడుతున్న చెత్తను తరలించే వాహనాలు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ధర్మవరం పట్టణంలో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించే క్లాప్ ఆటోలు మరమ్మతులకు గురయ్యాయి. ప్రస్తుతం అవి మున్సిపల్ కార్యాలయంలో మూలకు చేరాయి. ఏడాదిన్నరగా మరమ్మతులు చేయించక పోవడంతో తుప్పు పడుతున్నాయి. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తుండటంతో విలువైన భాగాలు పాడైపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో స్వచ్ఛభారత్ మిషన్ కింద ధర్మవరం మున్సిపాలిటీకి 25 ఆటోలు మంజూరు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వీటి నిర్వహణ బాధ్యతలను వైకాపా ముఖ్య సన్నిహితులైన వైఎస్ఆర్ జిల్లాకు చెందిన ఓ ఏజెన్సీకి అప్పజెప్పారు. వారు డ్రైవర్లను సొంతంగా ఏర్పాటు చేసుకుని, వేతనాలు ఇచ్చేలా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. ఆటోలు మరమ్మతులకు గురైతే దానికి సంబంధించిన ఖర్చులను వారే భరించాల్సి ఉంది. మొత్తం 25 ఆటోల్లో కేవలం 10 మాత్రమే పట్టణంలో తిరుగుతూ చెత్త సేకరిస్తున్నాయి.

స్పందించని ఏజెన్సీ నిర్వాహకులు

ప్రజల నుంచి వసూలు చేసిన చెత్త పన్నులు మాత్రం ప్రతినెలా జమ చేయించుకుంటున్నా.. ఏజెన్సీ నిర్వాహకులు ఆటోల నిర్వహణను పట్టించుకోవడం లేదు. ఏడాదిన్నర కిందట మరమ్మతులకు గురైన వాహనాలకు మరమ్మతులు చేయించాలని మున్సిపాలిటీ అధికారులు చెబుతున్నా స్పందించడం లేదు. దాంతో పట్టణంలో చెత్తను తరలించేందుకు సరిపడా వాహనాలు లేక శానిటేషన్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.



మూలకు చేరిన వాహనాలు

వాడుకలోకి తెస్తాం

క్లాప్ వాహనాల నిర్వహణ బాధ్యతలు తీసుకున్న గుత్తేదారును ఏడాది నుంచి సంప్రదిస్తూనే ఉన్నాం. వాహనాలు మరమ్మతులకు గురైన అంశాన్ని తెలియజేశాం. వారి నుంచి ఎటువంటి సమాధానం ఇవ్వడం లేదు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆటోలను వాడుకలోకి తెచ్చేలా చూస్తాం.

- శ్యాంసన్, మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్


జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ధర్మవరంలో ఇటీవల జరిగిన ఖోఖో పోటీల్లో ముదిగుబ్బలోని పీవీఎస్ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ఛైర్మన్ పీవీనాయుడు శుక్రవారం తెలిపారు. అండర్-17 విభాగం ఖోఖోలో రమ్యశ్రీ, మహిత, నవ్య, సునీల్‌కుమార్, నరేశ్, జితేంద్ర, వరుణ్‌కుమార్, అండర్-14 విభాగం ఖోఖోలో హర్షవర్ధన్, మధుసూదన్, యశ్వంత్, రోహిత్, అండర్-14 చెస్ విభాగంలో కౌశిక్ జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. కొడవండ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో అండర్-14 విభాగం ఖోఖోలో ప్రవల్లిక, అనన్య, తేజ, శిరీష, హర్షకల్పన జిల్లాజట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శంకర్‌రెడ్డి తెలిపారు.



విద్యార్థులతో పాఠశాల ఛైర్మన్ పీవీనాయుడు

ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా నరసింహులు



పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. కర్నూలు జిల్లా నుంచి ఆయన పదోన్నతితో బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సహదేవా బదిలీపై విజయవాడకు వెళ్లారు.